నమస్తే తెలంగాణ
ములుగు
జయశంకర్ భూపాలపల్లి
5 | వరంగల్, శుక్రవారం 7 ఫిబ్రవరి 2025 | MULUGU JAYASHANKAR BHUPALPALLY

**ఇందిరమ్మ ఇల్లు వస్తుందని ఎంతో ఆశపడ్డాడు.** అప్పటికే తన ఇల్లు మంటల్లో కాలిపోయిందని అధికారులకు ఫొటోలు కూడా చూపించి దరఖాస్తు చేశాడు. కానీ లబ్ధిదారుల జాబితాలో తన పేరు లేదని తెలిసి తట్టుకోలేకపోయాడు. అన్ని విధాలా తనకు అర్హత ఉన్నా పేరు ఎందుకు చేర్చలేదని.. పైగా అనర్హులకు ఎలా ఇస్తారంటూ జనవరి 23న ప్రజాపాలన గ్రామసభలో అధికారులను నిలదీశాడు. తన చావుతోనైనా గ్రామంలో అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు ఇవ్వాలని దీనంగా వేడుకుంటూ కుమ్మరి నాగేశ్వరరావు(45) తన వెంట తెచ్చుకున్న పురుగుల మందు తాగి ఆత్మహత్యకు ప్రయత్నించాడు. 15 రోజులుగా దవాఖానలో మృత్యువుతో పోరాడుతూ గురువారం కన్నుమూయడంతో ఇప్పుడా కుటుంబం వీధినపడింది. ఈ సంఘటన ములుగు జిల్లా కన్నాయిగూడెం మండలం కొత్తూరులో పెను విషాదం నింపింది. కాగా నాగేశ్వరరావుది ఆత్మహత్య కాదని ముమ్మాటికీ కాంగ్రెస్ సర్కారు హత్యేనని, మృతికి బాధ్యత వహించి రూ.25 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి, ములుగు జిల్లా అధ్యక్షుడు కాకులమర్రి లక్ష్మీనర్సింహారావు డిమాండ్ చేశారు. అయితే ప్రభుత్వం పారదర్శకంగా లబ్ధిదారులను ఎంపికచేయకపోవడం, అధికారుల నిర్లక్ష్యమే అతడి ప్రాణంతీసిందని స్థానికులు మండిపడుతున్నారు.


నాగేశ్వరరావు మృతదేహం

*- కన్నాయిగూడెం, ఫిబ్రవరి 6*

# ఇందిరమ్మ ఇల్లు ప్రాణం తీసింది..

**లబ్ధిదారుల జాబితాలో పేరు లేదని మనస్తాపం**

- గత నెల 23న ప్రజాపాలన గ్రామసభలో పురుగుల మందు తాగిన రైతు నాగేశ్వర్‌రావు
- చికిత్స పొందుతూ గురువారం కన్నుమూత
- ఇంటి పెద్ద మృతితో వీధిన పడ్డ కుటుంబం
- ఇది ముమ్మాటికీ ప్రభుత్వ హత్యే : మాజీ మంత్రి ఎర్రబెల్లి, మాజీ ఎమ్మెల్యే పెద్ది
- బాధిత కుటుంబానికి రూ.25లక్షలు చెల్లించాలని డిమాండ్

ములుగు జిల్లా కన్నాయిగూడెం మండలం బుట్టాయిగూడెం జీపీ అనుబంధ గ్రామమైన కొత్తూరుకు చెందిన కుమ్మరి నాగేశ్వరరావు(నాగయ్య) అనే దళితుడు ఇందిరమ్మ ఇండ్ల కోసం దరఖాస్తు చేసుకున్నాడు. కానీ జాబితాలో తన పేరు రాకపోవడంతో అధికారుల దృష్టికి తీసుకెళ్లాడు. ఇదివరకే తన ఇల్లు పూర్తి గా కాలిపోయిందని తన ఇల్లు మంజూరు చేయాలని వేడుకుంటూ ఫొటోలను అధికారులకు చూపెట్టాడు. అలాగే గ్రామంలో 90శాతం మంది అర్హులు ఉంటే వీరికి కాకుండా అనర్హుల పేర్లు ఎలా వచ్చాయని అధికారులను నిలదీశాడు. ఇక తనకు ఇల్లు రాదనుకొని కుమిలిపోయాడు.. తనకు రాకపోయినా గ్రామంలోని అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు ఇవ్వాలని అధికారులను వేడుకుంటూ ప్రజాపాలన గ్రామసభ జరుగుతుండగానే అధికారుల ముందే తన వెంట తెచ్చుకున్న పురుగుల మందు తాగాడు. 15 రోజులుగా హనుమకొండలోని ఓ ప్రైవేట్ దవాఖానలో చికిత్స పొందుతున్నాడు. బుధవారం పరిస్థితి విషమించడంతో అక్కడినుంచి వరంగల్ ఎంజీఎంకు తరలించారు. చికిత్స పొందుతూ గురువారం తెల్లవారుజామున మృతిచెందారు. కాగా మృతదేహాన్ని గ్రామానికి తీసుకొస్తుండడంతో గ్రామంలో శాంతిభద్రతల సమస్య తలెత్తుతుందని పోలీసులు ముందస్తుగా ఇద్దరు ఎస్సైలతో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఎంపీడీవో కార్యాలయం వద్ద పోలీసులను కాపలాగా ఉంచారు. ఈ ఘటనపై బీఆర్‌ఎస్ పార్టీ ములుగు జిల్లా అధ్యక్షుడు కాకులమర్రి లక్ష్మీనర్సింహారావు స్పందించారు. నాగేశ్వరరావుది ముమ్మాటికీ కాంగ్రెస్ ప్రభుత్వ హత్యేనని అన్నారు. ముందుగా మృతుడికి సంతాపం తెలిపి కుటుంబ సభ్యులకు పరామర్శించారు. 15 రోజులుగా మృత్యువుతో పోరాడుతూ అచేతన స్థితిలో ఉన్న నాగేశ్వరరావును అధికారులు, నాయకులు పట్టించుకోకపోయినా బీఆర్‌ఎస్ పార్టీ అండగా నిలిచిందన్నారు. దీనిని రాజకీయకోణంతో కాకుండా మృతుడి కటుంబానికి రూ.25 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇచ్చి కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.


గ్రామసభలో అధికారులతో మాట్లాడుతున్న నాగేశ్వరరావు (ఫైల్)

## మా కుటుంబాన్ని రోడ్డున పడేశారు



కన్నాయిగూడెం : మా నాన్న మృతితో మేము రోడ్డున పడ్డామని నాగేశ్వరరావు పెద్ద కూతురు పూజ భోరున విలపించింది. మా నాన్నను బతికించుకునేందుకు, ఆస్పత్రి ఖర్చులకు అన్నీ అమ్ముకొని అప్పులు చేశామన్నారు. బీఆర్‌ఎస్ పార్టీ ములుగు జిల్లా అధ్యక్షుడు కాకులమర్రి లక్ష్మణ్‌బాబు మాకు ధైర్యం చెపుతూ ఎప్పుడు ఫోన్ చేసినా మాట్లాడేవారు. ఆయన ఆస్పత్రి ఖర్చులకు రూ. రెండు లక్షల యాభైవేలకు పైనే సాయం అందించారు. ఆయన అందుబాటులో లేకున్నా వారి తమ్ముడు ప్రదీప్ రావును పంపించగా కుటుంబ సభ్యుల తీరుగా దవాఖానలో దగ్గరుండి అన్నీ చూసుకున్నారని తెలిపింది. వైద్యం కోసం రూ.8 లక్షల వరకు ఖర్చు అయిందని, ప్రభుత్వం స్పందించి వైద్యకోసం చేసిన అప్పులను తీర్చి ఆదుకోవాలని కోరింది.

## నాగయ్యది ప్రభుత్వ హత్యే

- అర్హులను విస్మరిస్తున్న అసమర్థ ప్రభుత్వం
- మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు



దేవరుప్పుల : ప్రజాపాలన పేరుతో గ్రామసభలు పెట్టి అర్హులను విస్మరించడం వల్లే కుమ్మరి నాగేశ్వర్‌రావు పురుగుల మందు తాగి చనిపోయాడని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. దేవరుప్పులలో గురువారం ఆయన మాట్లాడుతూ నాగేశ్వర్‌రావు మృతి ఈ అసమర్థ ప్రభుత్వం చేసిన హత్యేనని అన్నారు. గ్రామ సభలో అధికారులు చదివిన లిస్టులో తన పేరు ఎందుకు లేదని ప్రశ్నించిన ఆయన తీవ్ర మనస్తాపం చెంది ఇంతటి అఘాయిత్యానికి పాల్పడ్డాడని, ఆయన మృతికి ప్రభుత్వం పూర్తి బాధ్యత వహించి రూ. 25 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని ఎర్రబెల్లి డిమాండ్ చేశారు. ఇది ఒక నాగేశ్వర్‌రావు సమస్య కాదని, గ్రామాల్లో అనేక మంది అర్హులు ఏడాది కాలంగా కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలు అమలు కాక నిరాశ నిస్పృహలతో ఉన్నారని చెప్పారు. రైతులు, నిరుపేదలను వంచించిన ఈ ప్రభుత్వానికి పాలన చేసే అర్హత లేదని, వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో ఈ ప్రభుత్వాన్ని ప్రజలు తిరస్కరిస్తారనే భయంతోనే ఎన్నికలను వాయిదా వేస్తూ వస్తున్నదన్నారు.


మృతుడి భార్య శాంతి, కూతుళ్లు శాలిని, ప్రణీత, కుమారుడు కాత్యాయక్‌ను ఓదార్చుతున్న నర్సంపేట మాజీ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి

## ప్రభుత్వమే బాధ్యత వహించాలి

- నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి
- ఎంజీఎం మార్చురీ వద్ద మృతుడి కుటుంబానికి పరామర్శ


వరంగల్ చౌరస్తా, ఫిబ్రవరి 6 : నాగేశ్వర్‌రావుది ముమ్మాటికీ కాంగ్రెస్ ప్రభుత్వ హత్యేనని, పథకాల పేరుతో పేదల ప్రాణాలు తీస్తున్నదని నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి ధ్వజమెత్తారు. గురువారం నాగేశ్వర్‌రావు మృతి విషయం తెలుసుకొని ఎంజీఎం మార్చురీ వద్దకు వచ్చి నివాళులర్పించారు. మృతుడి భార్య శాంతి, కూతుళ్లు షాలిని, ప్రణీత, కుమారుడు కాత్యాయక్‌లను ఓదార్చారు. అనంతరం పెద్ది విలేకరులతో మాట్లాడుతూ నాగేశ్వర్‌రావుది ముమ్మాటికీ కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన హత్యేనని అన్నారు. పురుగుల మందు తాగిన నాగేశ్వర్‌రావును స్థానిక పీహెచ్‌సీకి తరలించి అధికారులు చేతులు దులుపుకున్నారని ఆగ్రహం వ్యక్తచేశారు. పట్టించుకోవాల్సిన ప్రభుత్వం, మంత్రులు, నాయకులు ముఖం చాటేస్తున్నారని మండిపడ్డారు. ప్రథమ చికిత్స అనంతరం ములుగు ప్రభుత్వ హాస్పిటల్‌కి తరలించగా బీఆర్‌ఎస్ బాధితుడికి అండగా నిలిచి ఆరెపల్లి ప్రాంతంలోని ప్రైవేట్ హాస్పిటల్‌కు తరలించిందని తెలిపారు. పరిస్థితి విషమించడంతో ఎంజీఎంలో గురువారం తెల్లవారుజామున తుదిశ్వాస విడిచాడని, ముగ్గురు పిల్లలతో ప్రశాంతంగా సాగుతున్న నాగేశ్వర్‌రావు కుటుంబంలో కాంగ్రెస్ ప్రభుత్వం నిప్పులు పోసిందన్నారు. ఇంటి పెద్దను కోల్పోయి వీధినపడిన నాగేశ్వర్‌రావు కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని, రూ.25లక్షల ఎక్స్‌గ్రేషియాతో పాటుగా కుటుంబంలో ఒకరికి ఉద్యోగం కల్పించాలని బీఆర్‌ఎస్ పార్టీ తరపున డిమాండ్ చేశారు. అర్హతలు కలిగిన ప్రజలకు హక్కుగా అందాల్సిన సంక్షేమ పథకాలను కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, నాయకులకు మాత్రమేనంటూ ప్రజలను మోసం చేస్తున్నదని, ప్రజాసంక్షేమాన్ని అర్హులకు అందించే వరకు బీఆర్‌ఎస్ పోరాటం చేస్తుందని సుదర్శన్‌రెడ్డి స్పష్టంచేశారు.

## ఈడబ్ల్యూఎస్ కోటా కోసమే..



ఖిలావరంగల్ : కాంగ్రెస్ ప్రభుత్వం ఈడబ్ల్యూఎస్ కోటా కోసమే బీసీ జనాభాను తగ్గించి సమగ్ర కులగణన అర్థాన్నే మార్చేసింది. 2011లో 60 శాతం ఉన్న బీసీ జనాభాను ఇరవై లక్షలు తగ్గించి 56.33 శాతంగా చూపించడం విచారకరం. 7 శాతం ఉన్న ఓసీ జనాభాను ఏకంగా 13 శాతంగా చూపించింది. 1 శాతం కోటా ఎస్సీలది. ఇదంతా ఈడబ్ల్యూఎస్ కోటాను సమర్థించేందుకు కాంగ్రెస్ చేసిన కుట్ర. 7 శాతం ఉన్న ఓసీ జనాభాకు 10 శాతం రిజర్వేషన్‌ను అంకెల పరంగా సొంతం చేసుకున్న అతి పెద్ద కుట్ర. 20 లక్షల బీసీ జనాభా ఎటు పోయిందో కాంగ్రెస్ పెద్దలే చెప్పాలి. కామారెడ్డి డిక్లరేషన్‌లో ప్రకటించిన 42 శాతం స్థానిక సంస్థల కోటా 60 శాతమున్న బీసీలకు చెందుతుంది. కానీ ఇప్పుడు హిందూ బీసీ అని 46 శాతం చూపడం కాంగ్రెస్ ప్రభుత్వ దిగజారుడుతనమే. మొత్తంగా ఈ లెక్కలు పెన్సిల్‌తో రాసుకున్నప్పుడే అనుకున్నాం వాళ్లకు కావాల్సిన విధంగా చెరిపేసి రాసుకుంటారని. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని బీసీలు క్షమించరు. గణన సరిగా చేయకుంటే ఆ పార్టీని బొంద పెడుతరు. *–డాక్టర్ చింతం ప్రవీణ్‌కుమార్, బీసీ రైటర్స్ వింగ్ స్టేట్ చైర్మన్*

- తీర్మానాన్ని కేంద్రానికి పంపిస్తామనడంపై ఆగ్రహం
- రిజర్వేషన్లు తగ్గిస్తే ఊరుకోమంటున్న బడుగులు
- ఎన్నికల హామీ, కామారెడ్డి డిక్లరేషన్ అమలు చేయాలని పట్టు
- ఓసీలు పెరిగి.. బీసీలు ఎలా తగ్గారంటూ మండిపాటు
- ఈడబ్ల్యూఎస్ కోటా కాపాడుకునేందుకే కుట్రలంటూ ఆరోపణ
- ద్రోహం చేస్తే కాంగ్రెస్‌ను బొంద పెడతామని హెచ్చరిక



**రిజర్వేషన్లపై కాంగ్రెస్ కపట నాటకాన్ని** బీసీలు ఎండగడుతున్నారు. తప్పుల తడకగా ఉన్న కులగణనపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రిజర్వేషన్లు పెంచాల్సి వస్తుందనే బీసీ జనాభాను తగ్గించి చూపుతున్నారని మండిపడుతున్నారు. కులగణన నివేదికను కేబినెట్‌లో పెట్టి అసెంబ్లీలో చర్చించిన పిదప చట్టబద్ధత కల్పిస్తారనుకుంటే.. తీర్మానాన్ని కేంద్రానికి పంపుతామని సీఎం మెలిక పెట్టడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీని, కామారెడ్డి డిక్లరేషన్‌ను ఎట్టి పరిస్థితుల్లోనూ అమలు చేయాల్సిందేనని పట్టుబడుతున్నారు. 2014లో బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో జరిగిన సమగ్ర కుటుంబ సర్వేతో పోల్చితే ఇప్పుడు ఓసీల జనాభా ఎలా పెరిగిందని, బీసీలు ఎందుకు తగ్గారో ప్రభుత్వం సమాధానం చెప్పాలంటున్నారు. 7 శాతం ఉన్న ఓసీలకు 10 శాతం ఈడబ్ల్యూఎస్ కోటా కాపాడుకునేందుకే కుట్రలు పన్నుతున్నారంటూ ఆరోపిస్తున్నారు. బీసీ రిజర్వేషన్లపై సీఎం రేవంత్‌రెడ్డి చిత్తశుద్ధిని ప్రశ్నిస్తున్నారు. 60 ఏళ్లుగా బీసీలకు రాజకీయంగా, ఆర్థికంగా అన్యాయం జరుగుతున్నదని, మళ్లీ ద్రోహం చేయాలని చూస్తే ప్రజాక్షేత్రంలో కాంగ్రెస్‌కు బుద్ధి చెబుతామని హెచ్చరిస్తున్నారు. మళ్లీ ప్రత్యేకంగా కులగణన చేపట్టి రిజర్వేషన్లకు చట్టబద్ధత కల్పించాకే స్థానిక ఎన్నికలను నిర్వహించాలని డిమాండ్ చేస్తున్నారు.

*-నమస్తే నెట్‌వర్క్, ఫిబ్రవరి 6*

### అసంపూర్తిగా కులగణన సర్వే



భూపాలపల్లి రూరల్ : కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన కులగణన సర్వే మొత్తం అసంపూర్తిగా ఉంది. రాష్ట్రంలో 136 బీసీ కులాలుండగా ప్రభుత్వం చెబుతున్న లెక్కలు వాస్తవానికి దూరంగా ఉన్నాయి. ఇలాంటి అసంపూర్తి సర్వేను ప్రభుత్వం ఆమోదిస్తే బీసీలు తీవ్రంగా నష్టపోతారు. ప్రజలు అందుబాటులో లేరని బీసీ జనాభాలో కోత విధించారు. కాంగ్రెస్ నాయకులు రైతు భరోసాను రూ.15 వేలు ఇస్తామని చెప్పి రూ.12 వేలకు తగ్గించారు. అలాగే ఇప్పుడు బీసీల సంఖ్యను తక్కువగా చూపించి రిజర్వేషన్ శాతాన్ని కూడా తగ్గించే అవకాశం ఉంది. మరో స్పెషల్ డ్రైవ్ చేపట్టి నిజమైన బీసీల సంఖ్యను వెలువరించాలి.

*– తాటికంటి నరేశ్, తెలంగాణ పట్టభద్రుల బీసీ నిరుద్యోగుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు*

# మెలిక పెడితే.. మడత పెడతాం

## సీఎం రేవంత్‌రెడ్డి తీరుపై బీసీల ఆగ్రహావేశాలు

### రిజర్వేషన్లతోనే ఎన్నికలు నిర్వహించాలి

- 42 శాతం బీసీ కోటాను అమలు చేయాల్సిందే
- జాతీయ బీసీ సంక్షేమ సంఘం భూపాలపల్లి జిల్లా అధ్యక్షుడు బర్ల గట్టయ్య

జయశంకర్ భూపాలపల్లి, ఫిబ్రవరి 6 (నమస్తే తెలంగాణ) : 'రిజర్వేషన్లపై మాట తప్పితే ఊరుకోం.. కాంగ్రెస్ ఇచ్చిన మాట ప్రకారం 42 శాతం రిజర్వేషన్లు అమలు చేసి స్థానిక సంస్థల ఎన్నికల్లోకి వెళ్లాలి' అని జాతీయ బీసీ సంక్షేమ సంఘం జయశంకర్ భూపాలపల్లి జిల్లా అధ్యక్షుడు బర్ల గట్టయ్య డిమాండ్ చేశారు. గురువారం ఆయన 'నమస్తే తెలంగాణ'తో మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన మాటను తప్పి రిజర్వేషన్ల బంతిని కేంద్రం కోర్టులోకి నెట్టేయాలని చూస్తున్నదని, కులగణనపై ఇప్పటికీ పూర్తి క్లారిటీ లేదని అన్నారు. కామారెడ్డి డిక్లరేషన్‌కు పాతరేసి కేంద్రం ఆమోదిస్తేనే రిజర్వేషన్లు అమలు చేస్తామని రేవంత్ రెడ్డి కొత్త నాటకాలు ఆడుతున్నాడని, ఇందుకు ఏ మాత్రం ఒప్పుకునేది లేదన్నారు. 2014లో జరిపిన సమగ్ర కుటుంబ సర్వే, ఇప్పుడు చేసిన దానిని పరిశీలిస్తే ప్రభుత్వానికి ఎంత చిత్తశుద్ధి ఉందో అవగతమవుతుందన్నారు. బీసీల శాతం ఇంకా పెరగాల్సి ఉందని, కులగణనపై అనేక అపోహలు, అనుమానాలున్నాయని, వాటిని ప్రభుత్వం నివృత్తి చేయాలని, జాబితాను ప్రజల ముందుంచాలని డిమాండ్ చేశారు. 60 ఏళ్లుగా బీసీలకు రాజకీయంగా, ఆర్థికంగా అన్యాయం జరుగుతూనే ఉందని గట్టయ్య మండిపడ్డారు. ప్రభుత్వం కులగణన సర్వేను కేబినెట్‌లో పెట్టి అసెంబ్లీలో చర్చిస్తుందని, చట్టబద్ధత కల్పిస్తుందని ఎదురుచూశామని, తీరా రేవంత్‌రెడ్డి దీనిపై నోరు మెదపకుండా కేంద్రం కోర్టులోకి నెట్టి మోసం చేశారన్నారు. కులగణన తప్పుల తడక అని, మళ్లీ ప్రత్యేక ఫార్మాట్‌లో సర్వే జరిపించిన తర్వాతే బీసీ రిజర్వేషన్లు అమలు చేసి స్థానిక ఎన్నికలు నిర్వహించాలన్నారు. లేని పక్షంలో బీసీల ఆగ్రహానికి గురికాక తప్పదని గట్టయ్య హెచ్చరించారు.



### బీసీలను మోసం చేసేలా సర్వే..



హనుమకొండ చౌరస్తా : కాంగ్రెస్ చేసిన సర్వే బీసీలను మోసం చేసేదిగా ఉంది. గత ముఖ్యమంత్రి కేసీఆర్ సమగ్ర కుటుంబ సర్వేనే వంద శాతం కరెక్టు. 2014లో బీసీల జనాభా 1.85 కోట్లు, ఇప్పుడు 1.64 కోట్లుగా తేల్చారు. 21 లక్షల బీసీలను తక్కువగా చూపించారు. ఎస్సీ జనాభా కూడా తారుమారుగా చూపించారు. కానీ ఓసీలు మాత్రం 16 లక్షలు పెరిగినట్లు చూపించారు. ఇది కేవలం ఈడబ్ల్యూఎస్ కోటాను కాపాడుకోవడానికి చేసిన ఎత్తుగడలో భాగమే. 7 శాతం ఉన్న ఓసీలను దాదాపుగా 13 శాతంగా చూపించారు. అలాగే కులాల వారీగా జనాభాను ప్రకటించాలి.

*– పల్లెబోయిన అశోక్, ముదిరాజ్ మహాసభ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి*

### రిజర్వేషన్ పెంచాల్సి వస్తుందనే..



జనగామ రూరల్ : కాంగ్రెస్ ప్రభుత్వం మొదటి నుంచి బీసీలపై కక్షపూరితంగా వ్యవహరిస్తున్నది. కులగణన సర్వేలో బీసీ జనాభాను తగ్గించి చూపడం దారుణం. 2011 నుంచి ఇప్పటి వరకు రాష్ట్రంలో బీసీల జనాభా పెరిగిందే తప్ప తగ్గలేదు. కాంగ్రెస్ ప్రభుత్వం గత సర్వే లెక్కల కంటే కూడా తగ్గించే ప్రయత్నం చేస్తున్నది. గతంలో 7 శాతం ఉన్న ఓసీలు ఇప్పుడు 16 శాతానికి ఎలా పెరిగారు? బీసీలు ఎలా తగ్గారు? ప్రభుత్వం సమాధానం చెప్పాలి. జనాభా పెరిగితే బీసీ రిజర్వేషన్ పెంచాల్సి వస్తుందనే ప్రభుత్వం తగ్గించి చూపుతున్నది. దీనివల్ల బీసీల ఆగ్రహానికి గురికాక తప్పదన్నారు. కులగణన రిపోర్టులను గ్రామాల వారీగా ప్రకటించి బీసీలపై చిత్తశుద్ధిని ప్రకటించుకోవాలి. బీసీ రిజర్వేషన్‌ను 50 శాతానికి పెంచిన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలి.

*– బాల్దె విజయ, మార్కెట్ కమిటీ మాజీ చైర్‌పర్సన్, జనగామ*

### తప్పుల తడకగా సర్వే



పెద్దవంగర : కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన ఇంటింటి సర్వే పూర్తిగా తప్పుల తడక. రాష్ట్రంలో 100 శాతం సర్వే పూర్తి చేసి నివేదిక వెల్లడించాల్సి ఉంది. కానీ 96.9 శాతం మాత్రమే చేసి పూర్తయిందంటే ఎలా? మిగతా 3.1 శాతం కుటుంబాల సర్వే చేయకుంటే ఎలా పూర్తవుతుంది. అసంపూర్తి సర్వేను ప్రభుత్వం ఆమోదిస్తే బీసీలు తీవ్రంగా నష్టపోతారు. మళ్లీ పారదర్శకంగా సర్వేని పూర్తి చేస్తేనే బీసీలకు న్యాయం జరుగుతుంది.

*– దుంపల సమ్మయ్య, సగర సంఘం మహబూబాబాద్ జిల్లా అధ్యక్షుడు, బీసీ సంఘం నాయకుడు*

# చిత్రనగరిలో కురవి కుర్రోడు..

- షార్ట్ ఫిల్ముల నుంచి అసోసియేట్ డైరెక్టర్ స్థాయికి..
- ఎవరి అండా లేకుండానే రంగుల ప్రపంచంలోకి..
- ఇష్టపడిన రంగంలో రాణించేందుకు కష్టపడిన శ్రీనాథ్
- నేడు విడుదల కానున్న తండేల్ సినిమా
- సహకారమందించిన కుటుంబ సభ్యులు, మిత్రులు


హీరో నాగచైతన్యకు షాట్ వివరిస్తున్న శ్రీనాథ్



కురవి, ఫిబ్రవరి 6 : ఇష్టపడిన రంగంలో మనసు లగ్నం చేసి కష్టపడితే ఉన్నతశిఖరాలు అధిరోహించవచ్చని నిరూపించాడు ఓ పాతికేళ్ల యువకుడు. తాను కలలు కన్న రంగుల ప్రపంచంలోకి ఎవరి అండా లేకుండానే అడుగుపెట్టాడు. కష్టాలెన్ని ఎదురైనా వాటిని అధిగమిస్తూ అంచెలంచెలుగా పైకొచ్చి అసిస్టెంట్ డైరెక్టర్ స్థాయికి ఎదిగాడు. గ్రామీణ ప్రాంతం నుంచి వచ్చి సినీరంగంలో చోటు తనకంటూ స్థానం సంపాదించుకున్న అతడే మహబూబాబాద్ జిల్లా కురవి మండల కేంద్రానికి చెందిన కొదుమూరి శ్రీనాథ్. చందూ మొండేటి దర్శకత్వంలో శ్రీనాథ్ అసిస్టెంట్ డైరెక్టర్‌గా పనిచేయగా, అక్కినేని నాగచైతన్య, సాయిపల్లవి హీరో హీరోయిన్లుగా నటించిన తండేల్ సినిమా శుక్రవారం విడుదల కానుంది. వివరాల్లోకి వెళితే.. కురవిలో కిరాణా షాపు నడిపించుకుంటూ జీవనం సాగించే కొదుమూరి నాగమణి, వెంకటేశ్వర్లు దంపతులకు ఇద్దరు కుమారులు సాయినాథ్, శ్రీనాథ్, కుమార్తె నగ్మ ఉన్నారు. శ్రీనాథ్ పదో తరగతి చదువుతున్నప్పుడే సినిమాల వైపు మనసు మళ్లింది. తోటి స్నేహితుడు వీరేందర్‌తో కలిసి సినిమాల విషయమై చర్చించేవాడు. టెన్త్ పూర్తికాగానే తన స్నేహితులతో కలిసి షార్ట్ ఫిల్మ్‌లను నిర్మించడం.. అందులో నటించడం మొదలుపెట్టాడు. తన మనసులోని మాటను తల్లిదండ్రులకు చెబితే వారు భయపడ్డారు. ముందు చదువుకోమని చెబితే హైదరాబాద్‌లోని నారాయణ కాలేజీలో ఇంటర్మీడియట్.. గురునానక్‌లో కంప్యూటర్ సైన్స్‌లో ఇంజినీరింగ్ పూర్తిచేశాడు. ఆ తర్వాత ఇంట్లో ఒప్పించి 2018లో సినిమా రంగంవైపు అడుగులు వేశాడు.

**తొలుత జూనియర్ ఆర్టిస్టుగా..**

ఓ మిత్రుడి సలహాతో కృష్ణానగర్ అడ్డా వద్ద జూనియర్ ఆర్టిస్ట్‌గా శ్రీనాథ్ ప్రయాణం మొదలుపెట్టాడు. ఆ తరువాత మరో మిత్రుడి సూచనతో సెట్‌వర్క్‌లో పనిచేశాడు. శ్రీనాథ్‌ను చూసిన వారు అతడు చదువుకోలేదనుకునేవారు. అలాంటి సమయంలోనే ఓ మేకప్ ఉమెన్ శ్రీనాథ్‌ను పిలిచి అతడి చదువు విషయమై ఆరాతీసింది. తాను ఇంజినీరింగ్ పూర్తిచేశానని, డైరెక్టర్ కావాలనేది తన కోరిక అని చెప్పడంతో ఆ శాఖలోనే ప్రయత్నించాలని ఆమె సలహా ఇవ్వడంతో అటువైపు మళ్లాడు. ఇంట్లోవారు వద్దన్నా ఇష్టమైన రంగాన్ని ఎంచుకున్న శ్రీనాథ్ అనేక కష్టాలు పడ్డాడు. అవకాశాలు రాక.. ఇంట్లో ఎలా చెప్పాలో తెలియక గ్రామానికి రావాలనుకున్న సమయంలో ఓ వాట్సాప్ గ్రూప్‌లో 'బ్యాచ్‌లర్ పార్టీ' సినిమాకు అసిస్టెంట్ డైరెక్టర్ కావాలనే పోస్టు చూసి ప్రయత్నించాడు. ఎలాంటి డబ్బులు ఆశించకుండానే ఏడాదిన్నర సినిమా కోసం పనిచేశాడు. మధ్యలో అభిషేకంతో పాటు మరో రెండు డైలీ సీరియల్స్‌కు, రెండుమూడు చిన్న సినిమాలతో పాటు నందమూరి కల్యాణ్‌రామ్ హీరోగా వచ్చిన డెవిల్ చిత్రానికి అసిస్టెంట్ డైరెక్టర్‌గా, చివరకు తండేల్ సినిమాకు అసోసియేట్ డైరెక్టర్‌గా పనిచేశాడు. కాగా, తండేల్ సినిమా విజయవంతం కావడంతో పాటు శ్రీనాథ్‌కు మరిన్ని అవకాశాలు వచ్చి మంచి దర్శకుడిగా ఎదగాలని స్థానిక ప్రజలు ఆకాంక్షిస్తున్నారు.

# రాష్ట్రాల హక్కులు హరించేలా చట్టం

**యూజీసీకి బండా ప్రకాశ్ లేఖ**



హనుమకొండ చౌరస్తా, ఫిబ్రవరి 6: రాష్ట్రాల హక్కులు హరించేలా యూజీసీ–2025 చట్టం ఉందని, అందులోని నిబంధనలను ఉపసంహరించుకోవాలని శాసనమండలి డిప్యూటీ చైర్మన్, కాకతీయ యూనివర్సిటీ బోర్డ్ మాజీ మెంబర్ డాక్టర్ బండా ప్రకాశ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ)కి లేఖ రాశారు. యూనివర్సిటీలో రెగ్యులేషన్, ఉప కులపతులు, ఉపాధ్యాయులు, అకడమిక్ సిబ్బంది నియామకం, పదోన్నతికి సంబంధించి ఒక డ్రాఫ్ట్ విడుదల చేయగా, అందులోని అంశాలు రాష్ట్రాల హక్కులు, ప్రయోజనాలు, ఉన్నత విద్యా విధానాలకు వ్యతిరేకంగా ఉన్నాయన్నారు. ఈ నిబంధన వీసీ నియామకంలో రాష్ట్ర ప్రభుత్వాల పాత్రను నిర్వీర్యం చేస్తుందని, ఇది సంబంధిత రాష్ట్ర చట్టాల ద్వారా స్థాపించబడిన విశ్వవిద్యాలయాల ప్రస్తుత నిబంధనలకు విరుద్ధమన్నారు. శాసనసభ చట్టం ప్రకారం వీసీ నియామకంలో రాష్ట్ర ప్రభుత్వాల అధికారాలను ప్రస్తుత నిబంధనలు తొలగిస్తాయని, విద్య అనేది రాజ్యాంగంలోని ఉమ్మడి జాబితాలో ఉండడంతో అన్ని రాష్ట్రాలు తమ సొంత విశ్వవిద్యాలయ చట్టాలను రూపొందిస్తున్నాయని, ఇప్పటివరకు అవే చట్టాలు అమలులో ఉన్నాయన్నారు. నిబంధనలు చాలా అభ్యంతకరమైనవని, సమాఖ్యవాద స్ఫూర్తిని, రాష్ట్రం అమలు చేసిన చట్టాలను తుంగలో తొక్కుతుందన్నారు. అందువల్ల యూజీసీ ఈ అంశాలను పరిశీలించి, గతంలో ఉన్న అధికారాలను తొలగించే నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని బండా ప్రకాశ్ కోరారు.

## న్యాయవాదిని కొట్టిన ట్రాఫిక్ సీఐపై కేసు నమోదు

సుబేదారి, ఫిబ్రవరి 6 : న్యాయవాది గంధం శివపై దాడికి పాల్పడిన హనుమకొండ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ సీతారెడ్డిపై పోలీసులు కేసు నమోదు చేశారు. కేయూసీ జంక్షన్ వద్ద ఇటీవల శివపై ట్రాఫిక్ సీఐ దాడి చేయగా, బాధితుడిపైనే ట్రాఫిక్ పోలీసులు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదైంది. శివ ఫిర్యాదుపై పోలీసులు స్పదించకపోవడంతో హనుమకొండ, వరంగల్ జిల్లాల బార్ అసోసియేషన్ ప్రతినిధులు, న్యాయవాదులు తీవ్రంగా పరిగణించి సీఐ సీతారెడ్డిని సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. అదాలత్‌లోని జిల్లా కోర్టు ఎదుట గురువారం నిరసన తెలిపారు. ఇన్‌స్పెక్టర్‌పై చర్యలు తీసుకునే వరకు ఊరుకునేది లేదని హెచ్చరించారు. ఈ నేపథ్యంలో న్యాయవాదిపై దౌర్జన్యంగా వ్యవహరించిన సీతారెడ్డిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని బార్ అసోసియేషన్ ప్రతినిధులు డిమాండ్ చేయడంతో, పోలీసులు 115(2)351(2)296(b),3(5) BNS సెక్షన్ల కింద సీఐపై కేసు నమోదు చేశారు.